www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
13.10.2026



ధర్నాలు నిషేధం

- ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ పోలీసులు
- ప్రజా సమస్యలు, భద్రతా దృష్ట్యా వేదిక మార్పు
- ప్రత్యామ్నాయంగా మూడు వేదికలు ప్రకటన
- త్వరలో ప్రత్యేక మార్గదర్శకాల జారీ

దేశ రాజధాని న్యూఢిల్లీలో దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆందోళనలకు ప్రధాన వేదికగా నిలిచిన చారిత్రక జంతర్ మంతర్‌పై ఢిల్లీ పోలీసు యంత్రాంగం ఆంక్షల ఉచ్చు బిగించింది. నిత్యం ధర్నాలు, నిరసన గళాలతో హోరెత్తే ఈ ప్రాంగణంలో ఇకపై ఎలాంటి ఆందోళనలు చేపట్టడానికి వీల్లేకుండా పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రజల రాకపోకలు, ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల పరిరక్షణ సాకుతో కేంద్ర హోంశాఖ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను ఆందోళన ప్రాంతాల జాబితా నుంచి శాశ్వతంగా తొలగించింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాసేలా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరసనలకు ప్రత్యామ్నాయంగా కేవలం మూడు మైదానాలను మాత్రమే కేటాయిస్తూ తీసుకున్న ఈ వివాదాస్పద నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కలంజ్యోతి, న్యూఢిల్లీ



నేడు- నాన బియ్యం బతుకమ్మ

ఆశ్వయుజ మాసంలోని 4వ రోజు బతుకమ్మను పేరుస్తారు. ఈరోజు తంగేడు పూలు, గునుగు పూలతో నాలుగంతరాలుగా బతుకమ్మను పేర్చి శిఖరంపైన గౌరమ్మను పెడతారు. ఈరోజున నాన బెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి బతుకమ్మకు నైవేద్యంగా నివేదిస్తారు.



అన్నపూర్ణేశ్వరిగా భద్రకాళి అమ్మవారు

- రెండో రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- అన్నపూర్ణాదేవిని దర్శించుకుంటే మృష్టాన్న ప్రాప్తి
- ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- మహామండపంలో సామూహిక కుంకుమార్చనలు
- అలరించిన సంగీత, నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు



సరస్వతీ శిశుమందిర్‌కు పూర్వ వైభవం

- రూ.80 లక్షల విరాళాలతో నవీకరణ
- కార్పొరేట్ వసతులున్నా సంస్కృతికే పెద్దపీట
- అందుబాటు ఫీజులతో నాణ్యమైన సీబీఎస్ఈ విద్య
- సిర్గాపూర్‌లో రెసిడెన్షియల్ హాస్టల్ భవన నిర్మాణం

చదువు నేర్పిన బడి రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. ఆదరణ కరువై మూతపడిన నిర్మల్ సరస్వతీ శిశుమందిర్‌కు తమ ఐక్యతతో జీవం పోసి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారు. రూ.80 లక్షల విరాళాలతో సరికొత్త హంగులు సమకూర్చి, డిజిటల్ తరగతులు, సీబీఎస్ఈ సిలబస్‌తో సకల వసతులు కల్పించారు. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన చదువును, నైతిక విలువలను అందిస్తూ శిశుమందిర్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చారు. భావితరాలకు భరోసానిస్తూ పల్లె పిల్లలకు సైతం ఆధునిక విద్యను చేరువ చేస్తున్న ఆ స్ఫూర్తిదాయక ప్రస్థానంపై 'కలంజ్యోతి' ప్రత్యేక కథనం...

3లో..

పూర్వ విద్యార్థుల కృషితో కార్పొరేట్ హంగులతో ముస్తాబైన స్కూల్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
మంగళవారం 13.10.2026
www.kalamjyothi.com

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో సంజన ప్రతిభ

- నిజామాబాద్ జిల్లాలో 11వ రాష్ట్రస్థాయి పోటీలు
- పోటీల్లో కాంస్య పతకం కైవసం
- అభినందించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామానికి చెందిన పడిదం సంజన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. సంజన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే క్రీడల్లో రాణిస్తూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై తన సత్తా చాటింది.

పోటీల్లో కాంస్య పతకం కైవసం..

ఈనెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా 11వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సంజన పట్టుదలతో ఆడి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వాహకులు ఆమెకు మెడల్, ట్రోఫీ అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తుల ప్రశంసలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తెచ్చిన విద్యార్థిని సంజనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాశాఖ అధికారిణి పాపమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు మంజుల, విద్యార్థిని తల్లిదండ్రులు పడిదం సునీల్, హేమలత, పెద్దనాన్న, పెద్దమ్మ అనిల్, రవళి, సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.







తుల్జాపూర్ భవానీకి పాదయాత్ర

15 ఏళ్లుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయం

కలంజ్యోతి, సంగారెడ్డి, చౌటకూర్ (అక్టోబర్ 13) : మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తుల్జా భవానీ అమ్మవారి దర్శనార్థం చౌటకూర్ మండల కేంద్రం నుంచి భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టారు. చౌటకూర్ గ్రామంలో గత 15 ఏళ్లుగా నిరంతరాయంగా తుల్జాపూర్ భవానీ అమ్మవారి దర్శనం కోసం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు భక్తుడు గాండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఏటా సంప్రదాయబద్ధంగా సాగే ఈ పాదయాత్ర ద్వారా గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా శాంతిసౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. తుల్జాపూర్ భవానీ క్షేత్రం మహిమాన్వితమైనదని, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఎంతో భక్తివిశ్వాసాలతో చేపట్టిన ఈ సుదీర్ఘ పాదయాత్ర ఎలాంటి విఘ్నాలు కలగకుండా దిగ్విజయంగా సాగాలని అమ్మవారి కృపను కోరుకున్నారు. ఏటా కొనసాగుతున్న ఈ యాత్రతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సమాచార హక్కుపై అవగాహన పెరగాలి

చెన్నారావుపేట ఎమ్మార్వో మహమ్మద్ ఆబిద్ అలీ

ఆర్టీఐ కరపత్రం ఆవిష్కరణ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : సమాచార హక్కు చట్టం-2005పై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడంతో పాటు, చట్టబద్ధమైన సమాచారాన్ని పొందే హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా ప్రత్యేక అవగాహన కరపత్రాన్ని రూపొందించారు. సమాచార హక్కు చట్టం-2005 అమలు దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నారావుపేట మండల కేంద్రంలో మండల అధికారులు ఈ కరపత్రాన్ని ఆవిష్కరించారు. చెన్నారావుపేట ఎమ్మార్వో మహమ్మద్ ఆబిద్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ ముఖ్య అతిథులుగా హాజరై, సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ సభ్యులు రూపొందించిన ఈ ప్రత్యేక కరపత్రాన్ని విడుదల చేశారు. సహా చట్టం సొసైటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లేపు ప్రణీత్, జిల్లా మీడియా కన్వీనర్ కల్లేపు గణేష్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కరపత్రంలో సమాచార హక్కు చట్టం-2005లోని కీలక సెక్షన్లు, భారత రాజ్యాంగ పీఠికతో పాటు సైబర్ క్రైమ్ నివారణ, రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, మాదకద్రవ్యాల నివారణ వంటి ప్రస్తుత సమాజానికి అత్యంత అవసరమైన ముఖ్యమైన అంశాలను పొందుపరిచారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు చట్టాలను బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. గ్రామీణ స్థాయి వరకు సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఇలాంటి ప్రచార కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు.



బిమోల్‌ను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయాలి

మహిళా మోర్చా జిల్లా ఇంచార్జి నల్లుల్ల సంగీత

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 12) : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ బిమోల్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ లోని శివాజీ చౌక్ లో నిరసన వ్యక్తం చేసి మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. మేకల శిల్పా రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఇంచార్జి నల్లుల్ల సంగీత మాట్లాడుతూ మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా విద్యార్థులపై వేధింపులకు సంబంధించిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని అమె డిమాండ్ చేశారు.



మహిళలపై వేధింపుల ఆరోపణల విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని, సంబంధిత ఎంపీపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షులు బొప్పరపు సత్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల కల్పన, బీజేపీ సీనియర్ నాయకురాలు అలివేలు మంగ, జిల్లా ఉపాధ్యక్షులు మమత, తోకల సరస్వతి, జన్నారం మహిళా మోర్చా అధ్యక్షులు శిరీష, జిల్లా నాయకులు దీపిక తదితరులు పాల్గొన్నారు.

రేపాక అభివృద్ధికి నిరంతర కృషి

బతుకమ్మ వేడుకలకు 18 విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 13) : రేపాక గ్రామ సమగ్ర అభివృద్ధికి సర్పంచ్ కాత మల్లేశం ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గ్రామంలోని పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా, రానున్న బతుకమ్మ పండుగ వేడుకలను పురస్కరించుకుని భక్తులకు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో సర్పంచ్ కాత మల్లేశం ఆధ్వర్యంలో 18 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. పండుగ వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. గ్రామ అభివృద్ధిని పరుగులు పెట్టించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొదని మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కూన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 13) : గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మరికొద్ది రోజుల్లో దసరా పండుగ ఉన్నందున, కార్మికుల కుటుంబాలు పండుగను సంతోషంగా జరుపుకునేలా పెండింగ్‌లో ఉన్న రెండు మాసాల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీవో నంబర్ 6 ప్రకారం నిర్ణీత వేతనాలను కచ్చితంగా అమలు చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
మంగళవారం 13.10.2026
www.kalamjyothi.com






సరస్వతీ శిశుమందిర్‌కు పూర్వ వైభవం

పూర్వ విద్యార్థుల కృషితో కార్పొరేట్ హంగులతో ముస్తాబైన స్కూల్

- రూ.80 లక్షల విరిళాలతో నవీకరణ
- కార్పొరేట్ వసతులున్నా సంస్కృతికే పెద్దపీట
- అందుబాటు ఫీజులతో నాణ్యమైన సీబీఎస్ఈ విద్య
- సిర్గిపూర్‌లో రెసిడెన్షియల్ హాస్టల్ భవన నిర్మాణం

చదువు నేర్పిన బడి రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. ఆదరణ కరువై మూతపడిన నిర్మల్ సరస్వతీ శిశుమందిర్‌కు తమ ఐక్యతతో జీవం పోసి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారు. రూ.80 లక్షల విరాళాలతో సరికొత్త హంగులు సమకూర్చి, డిజిటల్ తరగతులు, సీబీఎస్ఈ సిలబస్‌తో సకల వసతులు కల్పించారు. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన చదువును, నైతిక విలువలను అందిస్తూ శిశు మందిర్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చారు. భావితరాలకు భరోసానిస్తూ పల్లె పిల్లలకు సైతం ఆధునిక విద్యను చేరువ చేస్తున్న ఆ స్ఫూర్తిదాయక ప్రస్థానంపై 'కలంజ్యోతి' ప్రత్యేక కథనం...



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 13) : దేశ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సరస్వతీ శిశుమందిరాలకు సమాజంలో విశిష్ట గుర్తింపు ఉంది. కాన్వెంట్ల మోజుతో విద్యార్థుల సంఖ్య తగ్గి మూతపడిన నిర్మల్ సరస్వతీ శిశుమందిర్‌కు పూర్వ విద్యార్థులే మూలస్తంభాలుగా నిలిచారు. కొద్ది నెలల వ్యవధిలోనే పూర్వ విద్యార్థులంతా ఏకమై నిధులు సమీకరించి పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో పునరుద్ధరించారు. నిర్మల్ పట్టణంలో సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ 1967లో ప్రారంభమైంది. అయితే కాలక్రమంలో కాన్వెంట్ల ప్రభావంతో విద్యార్థుల చేరికలు తగ్గి 201819 విద్యా సంవత్సరంలో పాఠశాల మూతపడింది. ఎందరినో ఉన్నత విద్యావంతులుగా, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన పాఠశాల ఇలా మూతపడటం పూర్వ విద్యార్థులను తీవ్రంగా కలచివేసింది.

రూ.80 లక్షల విరాళాలు, వస్తురూపేణా సాయం..

పాఠశాలకు పునర్వైభవం తేవాలన్న బలమైన సంకల్పంతో పూర్వ విద్యార్థులు ఆగస్టులో పూర్వ విద్యార్థి పరిషత్ పేరిట జట్టుగా ఏర్పడ్డారు. పాఠశాల ఆరంభం నుంచి చదువుకున్న సుమారు 16 వేల మందికి పైగా పూర్వ విద్యార్థుల వివరాలను సేకరించారు. అనంతరం మూడు జిల్లాల ఇన్‌చార్జి రావుల సూర్యనారాయణను కలిసి పాఠశాల పునఃప్రారంభ సంకల్పాన్ని వివరించి, నిధుల సేకరణకు నడుం బిగించారు. గతేడాది విజయదశమి పర్వదినాన పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పాఠశాలను కార్పొరేట్ స్థాయి వసతులతో తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్, నాదర్‌గుల్‌లోని శ్రీ విద్యా భారతి విద్యాలయం, కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లను సందర్శించి పలు ఆధునిక విద్యా విధానాలను అధ్యయనం చేశారు. ఈ క్రమంలో 198586 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. స్వదేశంలో, విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమవంతుగా సహాయం చేశారు. ఒక పూర్వ విద్యార్థి గ్రానైట్ వ్యాపారి కావడంతో సుమారు 20 టన్నుల గ్రానైట్‌ను ఉచితంగా అందించారు. స్థానిక ప్రముఖ వైద్యులు కూడా పూర్వ విద్యార్థులే కావడంతో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించారు. ఇలా నగదు, వస్తు రూపంలో దాదాపు రూ.80 లక్షలకు పైగా సాయం సమకూరింది. స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి కూడా ఇక్కడి పూర్వ విద్యార్థి కావడంతో పాలనా పరమైన మద్దతు లభించింది.

డిజిటల్ తరగతులు, పూర్వ విద్యార్థుల సంకల్పం..

ప్రస్తుతం పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి తరగతి గదిని ఆధునిక కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్ది డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. దృశ్యశ్రవణ మాధ్యమాల ద్వారా బోధన సాగుతుండటంతో విద్యార్థులకు అభ్యసనం ఎంతో సులభంగా, ఆసక్తికరంగా మారింది. పాఠశాల పురోగతికి, భావితరాల భవిష్యత్తుకు తాము ఎల్లవేళలా అండగా నిలుస్తామని పలువురు పూర్వ విద్యార్థులు కలంజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ స్పష్టం చేశారు.



కార్పొరేట్ హంగులున్నా సంస్కారవంతమైన విద్య..

పాఠశాలలో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చినప్పటికీ భారతీయ సనాతన సంస్కృతీ సంప్రదాయాలకే పెద్దపీట వేస్తున్నారు. ఆధునిక విజ్ఞానంతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం పెంపొందేలా పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా భావితరాలను సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దే సంస్కృతి శిశుమందిర్ సొంతమని నిర్వాహకులు స్పష్టం చేశారు.

అందుబాటు ఫీజులతోనే సీబీఎస్ఈ సిలబస్..

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా పాఠశాలలో నాణ్యమైన సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశ పెట్టారు. ఇతర ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు వేలల్లో, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై పెనుభారం మోపుతుంటే, ఇక్కడ మాత్రం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా అతి తక్కువ ఫీజులతోనే కార్పొరేట్ స్థాయి అత్యున్నత విద్యను అందిస్తున్నారు. శ్రీపంచమి రోజున కేవలం 11 మందితో ప్రవేశాలు మొదలవగా, పాఠశాల పునఃప్రారంభం నాటికి ఆ సంఖ్య 32కు చేరింది. పునరుద్ధరణ వివరాలు, నాణ్యమైన విద్యా ప్రమాణాల గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపడంతో ప్రవేశాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది.

సిర్గాపూర్‌లో రెసిడెన్షియల్ హాస్టల్ భవన నిర్మాణం..

శిశుమందిరాలకు ఉన్న ఆదరణలో భాగంగా ముధోల్ సరస్వతీ శిశుమందిర్‌కు సి.బి.ఆర్. ప్రసాద్ 2 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. అలాగే నిర్మల్ సరస్వతీ శిశు మందిర్ విస్తరణ కోసం సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది, సిర్గాపూర్‌కు చెందిన నిరంజన్ రెడ్డి నాలుగు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో త్వరలోనే గ్రామీణ, దూరప్రాంత విద్యార్థుల కోసం సకల సౌకర్యాలతో కూడిన రెసిడెన్షియల్ హాస్టల్, నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఒకప్పుడు వెలవెలబోయిన ప్రాంగణం ప్రస్తుతం సరికొత్త హంగులతో కార్పొరేట్ బడులకు ధీటుగా మారింది.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
మంగళవారం 13.10.2026
www.kalamjyothi.com

NO అని బదులిస్తే ఖాతా ఖాళీ

సబ్ ఇన్స్పెక్టర్ పొన్నాల గోవర్ధన్

సైబర్ నేరగాళ్ల సరికొత్త పన్నాగం

- గుర్తుతెలియని నంబర్లను వెంటనే బ్లాక్ చేయాలి
- బాధితులు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- చెన్నారావుపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : ఓటీపీ చెప్పాల్సిన అవసరం లేదు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం వాట్సాప్‌లో 'NO' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయమవుతోంది. సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్ అనే సరికొత్త మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని చెన్నారావుపేట సబ్ ఇన్ స్పెక్టర్ పొన్నాల గోవర్ధన్ హెచ్చరించారు. గుర్తుతెలియని నంబర్ నుంచి మీ ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయ్యాయని, ఈ లావాదేవీ మీరు చేయకపోతే వెంటనే 'NO' అని బదులివ్వాలని మెసేజ్ పంపుతారు. కంగారుపడి అలా సమాధానం ఇచ్చినమరుక్షణమే సందేశంలోకనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్స్ యాక్టివేట్ అయి మొబైల్ ఫోన్‌పై నియంత్రణను హ్యాకర్ల చేతుల్లోకి తీసుకెళ్తాయి. బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లను దొంగిలించి ఖాతాను ఖాళీ చేస్తారని, ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ తరహా దాడిలో భారీగా నష్టపోయారని తెలిపారు.

గుర్తుతెలియని నంబర్లను వెంటనే బ్లాక్ చేయాలి..

ఈ ప్రమాదకరమైన మోసం నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'YES' లేదా 'NO' అని రిప్లై ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాంటి సందేశాలు రాగానే ఆందోళన చెందకుండా వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి చాట్‌ను పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే సరిచూసుకోవాలని, వాట్సాప్ సందేశాలను ఏమాత్రం విశ్వసించవద్దని తెలిపారు. ఏ అధికారిక బ్యాంకు కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి ధ్రువీకరణలు కోరదని గుర్తుంచుకోవాలన్నారు.

బాధితులు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి..

పొరపాటున ఎవరైనా ఈ మోసం బారిన పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లో స్పందించాలని గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు. బాధితులు తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. నేరం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే బ్యాంకు ఖాతాల్లోని డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేసే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత..

చెన్నారావుపేట ఎస్సైగా పొన్నాల గోవర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని, నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, మండలంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి విధులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ప్రజాపాలనలో సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇళ్లకు ఘనంగా భూమిపూజ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : పేద ప్రజలకు అండగా నిలుస్తూ వారి సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. చెన్నారావుపేట మండలంలోని శంకరం తండా, గొల్లభామ తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్, సొసైటీ చైర్మన్లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు కొర్ర వసంత, అమ్మిలకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలోని పేద, నిరుపేద కుటుంబాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. పేదలకు గూడు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి శాశ్వత నివాసం ఏర్పడుతుందని నాయకులు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, గ్రామ సర్పంచ్ లావణ్య హనుమా నాయక్, గొల్లభామ తండా, అమీన్‌బాద్ సర్పంచ్‌లు బాలు నాయక్, దార రంజిత్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, ఉపసర్పంచ్ బోడ చందా, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బానోత్ ఈర్య, హచ్చా కొర్ర బీము, దామోదర్, బోడ బాలు, కుమారస్వామి, బద్రు, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు,

ఆశా కార్యకర్తల సదస్సు జయప్రదం చేయండి

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 13) : ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో జరిగే సమ్మె సన్నాహక జిల్లా సదస్సును విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లకు రూ.18 వేల స్థిర వేతనంతో పాటు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌లో వికారాబాద్ జిల్లా ఆశాల సమ్మె సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకుంటే పోలీసులను ఉపయోగించి ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అణచివేయడం సరికాదన్నారు.



సదస్సుకు తరలిరావాలని శ్రేణులకు పిలుపు

నేడు వరంగల్ రాజరాజేశ్వర గార్డెన్‌లో జరిగే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి మంజుల, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ అధ్యక్షురాలు సంధ్య, కార్యదర్శి భారతి, జమున, రమ, జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

ఏకగ్రీవంగానే మండల యాదవ సంఘం ఎన్నిక

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 13) : మండల యాదవ సంఘం అధ్యక్ష ఎన్నిక రద్దయిందంటూ సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న అసత్య ప్రచారాన్ని నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఓరుపుల రాములు తీవ్రంగా ఖండించారు. ఎన్నిక రద్దయినట్లు వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వస్తున్న తప్పుడు సమాచారాన్ని ఎవరూ విశ్వసించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓరుపుల రాములు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మండలంలోని 21 గ్రామాల అధ్యక్షులు, ఆయా గ్రామాల సభ్యుల సమక్షంలో నిబంధనల ప్రకారమే తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని స్పష్టం చేశారు. ఎన్నిక ప్రక్రియ సజావుగా ముగిసిన తర్వాత కొందరు వ్యక్తులు ఓర్వలేక ఎన్నిక రద్దయిందంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. యాదవ సంఘం ఎన్నిక అందరి ఏకాభిప్రాయంతో, ప్రశాంత వాతావరణంలో జరిగిందని పేర్కొన్నారు. నిరాధారమైన ప్రచారాలను తోసిపుచ్చి వాస్తవాలను గుర్తించాలని కోరారు. సంఘం సర్వతోముఖాభివృద్ధికి, యాదవుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గానికి సమాజ బాంధవులందరూ సంపూర్ణ సహకారం అందించాలని ఓరుపుల రాములు కోరారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
మంగళవారం 13.10.2026
www.kalamjyothi.com

పట్టణాభివృద్ధి నిధులు విడుదల చేయాలి

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 13) : నిర్మల్ పట్టణాభివృద్ధికి గతంలో మంజూరైన రూ.50 కోట్ల టూఫిడ్సి (TUFIDC) నిధులను వెంటనే విడుదల చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. శరవేగంగా పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం అత్యంత కీలకమని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. గతంలో టూఫిడ్సి మేనేజింగ్ డైరెక్టర్ మంజూరు చేసిన రూ.50 కోట్ల పనులకు సంబంధించి సవరించిన ప్రతిపాదనలు (రివైజ్డ్ ప్రపోజల్స్) పంపాలని గతేడాది జిల్లా కలెక్టర్‌ను కోరారని గుర్తుచేశారు. ఆ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి ఏడాది కావస్తున్నా నేటికీ నిధులు విడుదల కాకపోవడంతో పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో నిర్మల్ మున్సిపాలిటీకి నగరాభివృద్ధి కింద రూ.15 కోట్లు మంజూరు చేసినప్పటికీ, గతంలో కేటాయించిన ప్రధాన నిధులు మాత్రం ఇంకా చేతికి అందలేదని పేర్కొన్నారు. పట్టణ ప్రజల అవసరాలు, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధులను తక్షణమే విడుదల చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సీఎంను కోరారు.

అనుమానాస్పద లింకులు తెరవొద్దు

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై ఉపేంద్రచారి



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 13) : సామాజిక మాధ్యమాల్లో ఆర్‌టీఓ ట్రాఫిక్ ఈచలాన్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద ఏపీకే (APK) ఫైళ్లు, లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని ఇల్లంతకుంట ఎస్సై ఉపేంద్ర చారి మండల ప్రజలను హెచ్చరించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన సైబర్ నేరాల పట్ల ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు ఇలాంటి నకిలీ ఫైళ్ల ద్వారా మొబైల్ ఫోన్లలోకి మాల్‌వేర్‌ను చొప్పించి వ్యక్తిగత డేటా, బ్యాంకు ఖాతాల వివరాలను దొంగిలించే ప్రమాదం ఉందని తెలిపారు. వాట్సాప్ గ్రూపులు, ఇతర మాధ్యమాల్లో ప్రచారమయ్యే గుర్తుతెలియని ఫైళ్లు, అనుమానాస్పద లింకులను నమ్మి క్లిక్ చేయవద్దని కోరారు. వాహన ట్రాఫిక్ చలాన్ల వివరాలను కేవలం అధికారిక ప్రభుత్వ పోర్టల్స్, యాప్‌ల ద్వారా మాత్రమే సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా పొరపాటున సైబర్ మోసాల బారిన పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని, సంబంధిత వివరాలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై ఉపేంద్ర చారి సూచించారు.


రెండు బైకులు ఢీకొని ప్రమాదం

మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : మండల పరిధిలోని ఖాదర్‌పేట శివారులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నర్సంపేటకు చెందిన కొత్త సత్యనారాయణ ముడిసరుకుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఖాదర్‌పేట శివారులోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఆయన ప్రయాణిస్తున్న బైకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలట్ వైనాల నాగరాజు, ఈఎంటీ ప్రవీణ్ కుమార్ తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులకు 12 గంటల విద్యుత్ ఇవ్వాలి

చండి సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా
మద్దతు తెలిపిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



కలంజ్యోతి, శివంపేట (అక్టోబర్ 13) : వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ మెదక్ జిల్లా శివంపేట మండలంలోని చండి సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. పొలాలకు సకాలంలో కరెంట్ అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి నిరసనను విరమింపజేశారు.

నీరందక పంటలు ఎండిపోతున్నయ్..

కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో బోర్ల ద్వారా పంటలకు నీరు పారించలేకపోతున్నామని రైతులు వాపోయారు. కీలక దశలో వరి పొలాలకు నీరు అందకపోతే దిగుబడి తీవ్రంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని, విద్యుత్ కోతల వల్ల పంటలు కళ్లముందే ఎండిపోయే దుస్థితి దాపురించిందని ఆవేదన చెందారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతాంగం ఆవేదన వ్యక్తం చేసింది.

కరెంట్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి..

రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో కరెంట్ కోతలు విధించి రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని హెచ్చరించారు. అన్నదాతలు సబ్‌స్టేషన్ల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజా రమణ గౌడ్, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతి చంద్ర గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాయత్రీదేవిగా అమ్మవారు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 13) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాధుల నగర్ గ్రామంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన అమ్మవారి సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించి, కొబ్బరికాయలు సమర్పించి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రీ దేవి రూపాన్ని పూజించడం వల్ల జ్ఞానం, వివేకం, చైతన్యం చేకూరుతాయని భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్ల నమోదు ముమ్మరం

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ శ్రేణుల ప్రత్యేక దృష్టి

కలంజ్యోతి, సంగెం (అక్టోబర్ 13) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విస్తృత కార్యాచరణ చేపట్టాయి. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు సంగెం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. గ్రామాల వారీగా అర్హులైన పట్టభద్రులను నేరుగా సంప్రదిస్తూ, దరఖాస్తులకు అవసరమైన వివరాలను సేకరిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను పట్టభద్రులకు వివరిస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచనల ప్రకారం పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి గ్రామంలోని పట్టభద్రులందరినీ ఓటర్ల జాబితాలో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటంతో మండల వ్యాప్తంగా నమోదు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది.



మాజీ ఉపసర్పంచ్ కొమురయ్యకు నివాళులు

దశదిన కర్మకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 13) : గ్రామ అభివృద్ధికి సేవలందించిన మాజీ ఉపసర్పంచ్ కొత్త కొమురయ్య మృతి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కొత్త కొమురయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన దశదిన కర్మ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చేరుకున్నారు. మండల నాయకుడు భూక్య సురేష్‌తో కలిసి కొమురయ్య స్వగృహాన్ని సందర్శించిన నాయకులు, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.2 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొమురయ్య కుటుంబానికి పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, నాయకుడు తూటి రమేష్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న, నాయకులు బాదావత్ పెద్ద వీరు, బాదావత్ వీరు, ముత్యం భద్రయ్య, వార్డు సభ్యులు ఒంటరి రాజు, ఇస్లావత్ వీరు, బాదావత్ సురేష్, బూత్ అధ్యక్షులు తేజావత్ శివ, బాదావత్ కిషోర్, ఒంటరి అశోక్, పడిదం రాకేష్, కొత్త ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





నన్ను తక్కువగా అంచనా వేస్తే వారి కర్మకే వదిలేస్తా!

చిత్ర పరిశ్రమలో దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రముఖ నటి అదితి రావు హైదరీ తన సినీ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 23న 40వ పుట్టినరోజు జరుపుకోబోతున్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా నేర్చుకున్న పాఠాలు, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇండస్ట్రీలో ఎదగడం కొండెక్కినంత కష్టమని, అయినప్పటికీ ఎదురైన ఇబ్బందుల నుంచే ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. తప్పులు చేయడానికి భయపడకూడదని, వాటి నుంచే గొప్పగా ఎదుగుతామని పేర్కొన్నారు. ఎవరితో పనిచేయాలి, ఎలాంటి పాత్రలు ఎంచుకోవాలనే విషయంలో తనకు పూర్తి స్పష్టత ఉందని, ఎవరైనా తప్పుడు పనులకు పాల్పడినా లేదా తనను తక్కువగా అంచనా వేసినా వారి కర్మకే వదిలేస్తానని అదితి రావు హైదరీ స్పష్టం చేశారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.